ఈనాడు విశ్వసనీయత కోల్పోయింది..

- తప్పుడు కథనాలపై పెల్లుబుకుతున్న ఆగ్రహ జ్వాలలు
- ఈనాడు ప్రతులను దహనం చేసిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



దహనమవుతున్న ఈనాడు పేపర్లు

విజయనగరం: ఈనాడు పత్రిక తన విశ్వసనీయతను ఏనాడో కోల్పోయిందని రాష్ట్ర శాసనసభ ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయనగరం నియోజకవర్గం ఆధ్వర్యంలో పూల్‌బాగ్ జంక్షన్ వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ ప్రజా ప్రతినిధులు ఈనాడు దినపత్రికలను శుక్రవారం దహనం చేశారు. కులపిచ్చి రాతలు, పచ్చరాతల రామోజీ డౌన్ డౌన్.. ఈనాడును బహిష్కరించండి.. తప్పుడు వార్తలను తిప్పి కొట్టండంటూ నినాదాలు చేశారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మీడియాతో మాట్లాడుతూ, 44 నెలలుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విప్లవాత్మక సంస్కరణలతో ప్రజారంజక పాలన కొనసాగిస్తుంటే.. ఈనాడు ప్రజలను మోసగించడానికి తప్పుడు కథనాలు ప్రచురిస్తోందన్నారు. పత్రికా రంగంలో ఈనాడుకు ఒకానొక సమయంలో సముచితమైన విలువ ఉండేదని.. పత్రికా అధినేత రామోజీరావు ప్రవర్తన, పనితీరు, పేపర్లో వస్తున్న అవాస్తవ వార్తల వల్ల నేడు హీనస్థితికి చేరుకుందన్నారు. పాఠకుల సంఖ్య రోజురోజుకూ తగ్గుతున్న సమయంలో ఏదోవిధంగా సంఖ్య పెంచుకునేందుకు ఈనాడు తప్పుడు వార్తలు రాస్తోందన్నారు. రామోజీరావు ఒక నేర పరిశోధనా సంస్థ అయినట్టుగా కథనాలు వండివారుస్తున్నారని మండిపడ్డారు. పోలీస్, సీబీఐ, న్యాయవ్యవస్థల నిర్ణయాలు, తీర్పులను కూడా భవిష్యత్‌లో రాస్తారేమోనని అనుమానం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకుడు పట్టాభిని పోలీసులు కొట్టారంటూ తప్పుడు కథనాలు రాసిన ఈనాడును బహిష్కరించాలంటూ పిలుపునిచ్చారు. సోషల్ మీడియా, పోటీ పత్రికల వల్ల ప్రజలకు వాస్తవం ఏమిటో క్షణాల్లో తెలుస్తోందని చెప్పారు. నిరసనలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, నగర పార్టీ అధ్యక్షుడు ఆశపు వేణు, పార్టీ మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, పార్టీ జేసీఎస్ కన్వీనర్లు సంగంరెడ్డి బంగారు నాయుడు, ముద్దాడ మధు, విజయనగరం జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు, మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు మామిడి అప్పలనాయుడు, జొన్నవలస పీఏసీఎస్ అధ్యక్షుడు కెల్ల త్రినాథ్, జోనల్ ఇన్‌చార్జ్‌లు ముచ్చు శ్రీనివాసరావు, అల్లు చాణక్య, గుజ్జల నారాయణరావు, బొద్దాన అప్పారావు, కాళ్ల సూరిబాబు, బోడసింగి ఈశ్వరరావు, బాల బ్రహ్మరెడ్డి, ఎవర్ణ కుమారస్వామి, కార్పొరేటర్లు మారోజు శ్రీనివాసరావు, బండారు ఆనంద్, వజ్రపు సత్యగౌరి, పార్టీ నాయకులు ఇసరపు రామకృష్ణ, బుంగ భానుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సారిపల్లిలో ఉచిత వైద్యశిబిరం రేపు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సారిపల్లిలో అనిల్ నీరుకొండ ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు గరివిడి శ్రీరామ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మజ్జి భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని రకాల వైద్య నిపుణులు ఈ వైద్య శిబిరంలో పాల్గొంటారని పేర్కొన్నారు. గుండె సంబంధిత రోగాలతో పాటు జనరల్ తనిఖీలు చేపట్టి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాల వద్ద ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు వైద్యశిబిరం కొనసాగుతుందని, రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం

నెల్లిమర్ల: నగర పంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 25న నిర్వహించనున్నట్లు చైర్‌పర్సన్ బంగారు సరోజిని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. 20 వార్డుల కౌన్సిలర్లు, అన్ని విభాగాల అధికారులు హాజరుకావాలని కోరారు.

పాఠశాలకు ఫర్నీచర్ వితరణ



పాఠశాలకు అందించిన ఫర్నీచర్‌తో సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు

దత్తిరాజేరు: మండలంలోని తిమిటేరు ప్రాథమిక పాఠశాలకు నాగపూర్‌కు చెందిన వైబ్రంట్ ఎనర్జీ హోల్డింగ్ ప్రైవేట్ లిమిటెడ్(సోలార్ పవర్ సంస్థ) రూ.1.50 లక్షలు విలువచేసే ఫర్నీచర్‌ను వితరణ చేసింది. ఏడు టేబుళ్లు, ఏడు బుక్‌షెల్ఫ్‌లు, బీరువా, ఏడు కుర్చీలు, ఇతర సామగ్రిని సంస్థ ప్రతినిధులు భానుప్రకాష్, కృష్ణ, సుజన్‌కుమార్‌లు పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావుకు అందజేసినట్లు సర్పంచ్ మంత్రి క్రాంతికుమార్ శుక్రవారం తెలిపారు. పాఠశాల అభివృద్ధికి సహకరించిన సంస్థ ప్రతినిధులను ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

అమ్మవారికి వెండి కుందెలు బహూకరణ



వెండి దీపం కుందెలు బహూకరిస్తున్న దాతలు

చీపురుపల్లి: పట్టణానికి చెందిన సుంకరి శ్రీనివాసరావు, కమల దంపతులు శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి 1250 గ్రాములతో రూ.85 వేలు విలువ చేసే వెండి దీపం కుందెలను బహూకరించారు. శుక్రవారం అమ్మవారి దేవస్థానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వెండి దీపం కుందెలను ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్, దేవస్థానం ఈఓ జి.శ్రీనివాస్‌లకు అందజేశారు. కార్యక్రమంలో సూరు కామేష్, కింతలి మధు, అడ్డాల రవి తదితరులు పాల్గొన్నారు.

పూరిపాక దగ్ధం



అగ్ని ప్రమాదంలో కాలిపోతున్న పూరిపాక

గుర్ల: మండల కేంద్రంలోని గొల్లవీధిలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిపాక పూర్తిగా దగ్ధం అయ్యింది. గ్రామానికి చెందిన కమ్మిండి అప్పలస్వామి చెందిన పాక కాలిపోయింది. ప్రమాదంలో విలువైన సామగ్రి కాలిపోయిందని బాధితుడు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు గ్రామానికి ఆనుకొని ఉన్న తోటలో ఆకులు కాల్చడం వల్ల ఈ అగ్ని ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. అగ్ని ప్రమాదానికి గురైనా పాకను రెవెన్యూ అధికారులు పరిశీలించారు.

సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలి



గృహ నిర్మాణాలపై ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో చర్చిస్తున్న డీఈ గౌరీశంకర్

గుర్ల: ఉగాది నాటికి సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు గృహ నిర్మాణ శాఖ డీఈ గౌరిశంకర్ ఆదేశించారు. మండల కేంద్రంలోని గృహ నిర్మాణ శాఖ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో ఆయన శుక్రవారం సమావేశమయ్యారు. మండలంలోని 1400 ఇళ్లు ఉగాది నాటికి గృహ ప్రవేశాలు చేయాలని, ఇప్పటికే 1200 ఇళ్లు గృహ ప్రవేశాలకు సిద్ధమయ్యాయని, మిగిలిన 200 ఇళ్లు కూడా కూడ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏఈ రామచంద్రరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా సీతంరాజును గెలిపించండి



ఓటర్‌తో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- నగరంలో ప్రారంభమైన ప్రచారం

విజయనగరం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. సీతంరాజుకు మద్దతుగా నగరంలోని ఒకటో డివిజన్ పూల్‌భాగ్‌లో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసి సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందుతుందన్నారు. శాసనమండలిలో వైఎస్సార్‌సీపీకి మెజార్టీ ఉందని.. ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలలో సీతంరాజు సుధాకర్‌ను గెలిపిస్తే ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందని చెప్పారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు, పారదర్శక పాలన అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందని తెలిపారు. నాలుగేళ్ల ప్రభుత్వ పాలనలో జరిగిన అభివృద్ధిని చూసి పట్టభద్రులు ఓటెయ్యాలని కోరారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, నగర పార్టీ, మండల అధ్యక్షులు ఆశపు వేణు, నడిపేన శ్రీనివాసరావు, పార్టీ జేసీఎస్ కన్వీనర్లు సంగంరెడ్డి బంగారునాయుడు, ముద్దాడ మధు, జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు, మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు మామిడి అప్పలనాయుడు పాల్గొన్నారు.

సీతంరాజు గెలుపు బాధ్యత వైఎస్సార్‌సీపీ శ్రేణులదే..



మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: మార్చి 13న జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపు కోసం కృషి చేయాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందని శాసనసభ ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. శుక్రవారం సాయంత్రం తన నివాసంలో జోనల్ ఇన్‌చార్జ్‌లు, కార్పొరేటర్లు, బూత్ కమిటీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ హయాంలో నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేశామన్నారు. ఎన్నికలు వచ్చాయంటే ప్రతిపక్షాలు రోడ్డు మీదకు వచ్చిన ఓట్లు అడుగుతాయని.. వైఎస్సార్‌సీపీ నాయకులు మాత్రం చేసిన అభివృద్ధిని చూపించి ఓట్లు అడుగుతారని చెప్పారు. ఎన్నికల ప్రచారాన్ని శుక్రవారం ఉదయం నుంచి ప్రారంభించామని తెలిపారు. ఓటర్ల నుంచి వస్తున్న ఆదరణ చూస్తుంటే సంతోషంగా ఉందని చెప్పారు. ఎన్నికలు ఉన్నా, లేకపోయినా ప్రజల్లో ఉండేది వైఎస్సార్‌సీపీ ఒక్కటేనన్నారు. గత శాసనమండలి ఎన్నికలలో విజయనగరం నియోజకవర్గంలో 8 వేల ఓట్లు నమోదు చేయడం జరిగిందని, నేడు 17 వేల ఓట్లు నమోదు చేయించినట్లు తెలిపారు. శాసనమండలి ఎన్నికలకు సంబంధించి విజయనగరంలో మహారాజా కళాశాల, కస్పా హైస్కూల్, సంస్కృత కళాశాల, సంగీత నృత్య కళాశాల, కంటోన్మెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో 20 బూత్‌లు ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసిందన్నారు. ఈ ఎన్నికను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి ప్రజలే పార్టీ బలపరిచిన అభ్యర్థిని గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నగర అధ్యక్షుడు ఆసపు వేణు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నగర మేయర్ శ్రీమతి వెంపడాపు విజయలక్ష్మి, జోనల్ ఇన్‌చార్జ్‌లు డాక్టర్ వీఎస్ ప్రసాద్, కోలగట్ల వీరవెంకట కృష్ణారావు, జేసీఎస్ కన్వీనర్లు సంఘంరెడ్డి బంగారు నాయుడు, ముద్దాడ మధు, జోనల్ ఇన్‌చార్జ్‌లు మామిడి అప్పలనాయుడు, కంటుభుక్త తవిటిరాజు, నడిపేన శ్రీనివాసరావు, కార్పొరేటర్లు తాళ్లపూడి సంతోషి, మారోజు శ్రీనివాసరావు, పద్మావతి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, జోనల్ ఇన్‌చార్జ్‌లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, బూత్ కమిటీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు , పార్టీ నాయకులు పాల్గొన్నారు.



హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు

27న ఉద్యోగ మేళా

విజయనగరం పూల్‌బాగ్: నగరంలోని ఆర్‌కే డిగ్రీ కళాశాలలో హెచ్‌సీఎల్ కంపెనీ వారు ఈ నెల 27న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల డైరెక్టర్ కోలా సంతోష్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నెట్‌వర్క్ ఎనలిస్ట్/డేటా ఎనలిస్ట్, తదితర విభాగాల్లో అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. బీఎస్సీ/ఎంసీఏ/బీటెక్ గ్రాడ్యుయేట్లు (అన్ని విభాగాలు) 2017 నుంచి 2022 మధ్య పాసైన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తమ రెజ్యూమ్, ఆధార్, విద్యార్హత పత్రాలతో ఆ రోజు ఉదయం 8.30 గంటలకు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ సృజన, ఏఓ ఎం. గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

దేవుని నెలివాడలో చండీహోమం రేపు



రాజరాజేశ్వరి అమ్మవారు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని రామతీర్థం సమీపంలో ఉన్న దేవుని నెలివాడలో గల రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం చండీహోమం నిర్వహించనున్నట్లు ధర్మకర్త లెంక రామసత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, ఆ రోజు ఉదయం ఏడున్నర గంటలకు జరగనున్న హోమంలో భక్తులందరూ పాల్గొనాలని కోరారు.

ప్రథమ చికిత్సపై అవగాహన అవసరం

విజయనగరం ఫోర్ట్: ప్రథమ చికిత్సపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని రెడ్‌క్రాస్ వైద్యుడు వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంక్‌లో ప్రథమ చికిత్సపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదాలు, రోడ్డు ప్రమాదాల్లో బాధితులకు అందించాల్సిన ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించారు. అలాగే గుండె నొప్పి వచ్చిన వెంటనే చేయాల్సిన సీపీఆర్‌పై వివరించారు. కార్యక్రమంలో గౌరీశంకర్, తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే పరిశీలన

కొత్తవలస: విశాఖ – రాయ్‌పూర్ గ్రీన్‌ఫీల్డ్ హైవేను కలెక్టర్ సూర్యకుమారి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దెందేరు, సంతపాలెం, వీరభద్రపురం, గులివిందాడ, రాజపాత్రునిపాలెం గ్రామాలలో జరుగుతున్న హైవే పనులను గ్రీన్‌ఫీల్డ్ హైవే సిబ్బందితో పరిశీలించి, పలు సూచనలు చేశారు.

అబ్బురపరుస్తున్న మామిడి గుత్తులు



మామిడి కాయలతో దర్శనమిస్తున్న చెట్టు

లక్కవరపుకోట: ప్రస్తుత వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా మామిడి పూత అంతంతమాత్రంగానే ఉంది. మండలంలో ఎక్కడా పూత పెద్దగా కనిపించకపోయినప్పటికీ, మండల కేంద్రానికి సమీపంలో గల కూరాకుల సూర్యారావుకు చెందిన కల్యాణ మంటపం వద్ద ఓ మామిడి చెట్టుకు గుత్తులు, గుత్తులుగా మామిడికాయలు కాశాయి. దీంతో ఈ చెట్టును ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారు.

సురేష్‌బాబుకు అభినందనల వెల్లువ



డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామితో సురేష్ బాబు



డాక్టర్ సురేష్‌బాబుతో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: శాసనమండలి సభ్యుడు డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావులను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రెండోసారి ఎమ్మెల్సీగా డాక్టర్ సురేష్‌బాబుకు అవకాశం కల్పించడంపై కోలగట్ల, మజ్జి అభినందించారు.

అభినందనలు

నెల్లిమర్ల రూరల్: ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబుకు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ అధిష్ఠానం సురేష్ బాబు పేరును ఇటీవల ప్రకటించిన నేపథ్యంలో మొయిదలోని ఆయన స్వగృహానికి వైస్ ఎంపీపీ పతివాడ సత్యనారాయణ, సర్పంచ్‌లు పతివాడ అప్పన్న, అంబళ్ల కిరణ్, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు తరలివచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సత్కరించారు.



పెనుమత్స సురేష్‌బాబుకు అభినందిస్తున్న నాయకులు

రహదారి భద్రతా ప్రమాణాలు పాటించాలి

- సీఐ విజయ్‌నాథ్



మాట్లాడుతున్న సీఐ విజయనాథ్

పూసపాటిరేగ: రహదారిపై వెళ్లేటప్పుడు భద్రతా ప్రమాణాలు పాటించాలని భోగాపురం సీఐ కేవీవీ విజయనాథ్ అన్నారు. శుక్రవారం స్థానిక కొవ్వాడ రహదారిలో గల పాలిటెక్నికల్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రహదారిపై వెళ్లేటప్పుడు అజాగ్రత్తగా ఉండడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై ఎ.నరేష్, కరస్పాండెంట్ పతివాడ రమణ, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎంవీజీఆర్ కళాశాలలో 'ఫ్రీడమ్ ఫెస్ట్'



విద్యార్థులతో మాట్లాడుతున్న జెమినీ సాఫ్ట్‌వేర్ డెవలపర్ సాయికిరణ్

డెంకాడ: తమను తాము అన్వేసించుకోవడానికి స్వేచ్ఛ లెర్నింగ్ సెంటర్ ఉపయోగపడుతుందని జెమినీ సాఫ్ట్‌వేర్ డెవలపర్ సాయికిరణ్ అన్నారు. సాఫ్ట్‌వేర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో స్వేచ్ఛా లెర్నింగ్ సెంటర్ ఏర్పాటు చేసి పదేళ్లు పూర్తయిన సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహించనున్న 'ఫ్రీడమ్ ఫెస్ట్' కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జెమినీ సాఫ్ట్‌వేర్ డెవలపర్ సాయికిరణ్, వైస్ ప్రిన్సిపాల్ వైఎంసీ శేఖర్ మాట్లాడుతూ ఇది చదడం, వెళ్లిపోవడం కాదన్నారు. కార్యక్రమంలో స్టూడెంట్ డీన్ ఎం.మోహన్ కుమార్, ఎస్‌ఎల్‌సీ కన్వీనర్ ఎం.వంశీకృష్ణ, ఫణీంద్ర, అధ్యాపకులు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సింగవరంలో 'పొలంబడి'



ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ నిర్మల

డెంకాడ: మొక్కజొన్న పంటలో ఆఖరి దఫా ఎరువుగా యూరియా, పొటాష్ కలిపి వేయాలని ఏఓ నిర్మల సూచించారు. మండలంలోని సింగవరంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ, మొక్కజొన్న పంటలో చివరిగా యూరియా, పొటాష్ వేయడం వల్ల గింజల నాణ్యత పెరుగుతుందని తెలిపారు. మొక్కజొన్న పంట అనంతరం రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ బి.రామకోటి, సీఏ గురుమూర్తి, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ ప్రారంభోత్సవం

శృంగవరపుకోట: పట్టణంలోని దేవీ జంక్షన్‌లో నూతనంగా నిర్మించిన లక్ష్మీగణపతి, వల్లీదేవసేన సహిత సుబ్రహ్మణ్యస్వామి, రమా దేవి సహిత సత్యనారాయణ స్వామి ఆలయాన్ని శుక్రవారం వైభవంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు దంపతులు, విశాఖపట్నం ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆర్.జగన్నాథం, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకులు తైనాల విజయకుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి, సర్పంచ్ సంతోషికుమారి, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌ను దరి చేరనీయొద్దు...



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్‌ఈబీ అదనపు ఎస్పీ ఆస్మాఫరీన్

- ఎస్‌ఈబీ అదనపు ఎస్పీ ఆస్మాఫరీన్

కొత్తవలస: డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్‌ఈబీ)అదనపు ఎస్పీ ఆస్మాఫరీన్ సూచించారు. మండల కేంద్రానికి సమీపంలో గల ఏపీ మోడల్ స్కూల్‌లో ఎస్‌ఈబీ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గంజాయి, కొకైన్, హెరాయిన్ వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడితే భవిష్యత్ అంధకారంగా మారిపోతుందన్నారు. ఎవరైనా ఇటువంటి పదార్థాలు వినియోగించినా, విక్రయించినా తమ శాఖకు సమాచారం అందించాలని కోరారు. డ్రగ్స్ వినియోగం వలన కలిగే అనర్థాలు, దుష్పరిణామాలు వీడియోల ద్వారా విద్యార్థులకు వివరించారు. అనంతరం సీఐ ఎస్.బాలసూర్యారావు, స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు ఎం.శృతి మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు దూరంగా వుంటూ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఈబీ ఎస్‌ఐ పప్పల నరేంద్ర, స్థానిక ఎస్‌ఐ బొడ్డు దేవి, పాఠశాల ప్రిన్సిపాల్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.